# రివర్స్ మార్చ్

ఏదో పిచ్చి కల... మావారిని ఎవరో కొడుతున్నారు. ఆయనకు ఒళ్లంతా రక్తం. 'రాణీ! పిల్లలు జాగ్రత్త' అంటూ ఆ దెబ్బలు భరిస్తూనే ఉన్నారు. నేను పిల్లల్ని పట్టుకొని ఏడుస్తూ ఆయనవైపు నడుస్తున్నాను. ఆయన తన దగ్గరకు రావద్దని హెచ్చరిక చేస్తుండగా మెలకువ వచ్చింది. గబుక్కునలేచాను. దుప్పటి నా చేతి నుంచి ఎప్పుడు జారి క్రింద పడిందో తెలియదు. బెడ్‌లైట్ వెలుతురులో వాల్‌క్లాక్ వైపు చూసాను టైమెంతయిందో తెలుసుకుందామని. కనిపించలేదు. ముందుకు నడిచి స్విచ్ వేశాను. వెలుతురు గదంతా వ్యాపించింది. టైము ఒంటిగంట దాటింది. టేబిల్ మీదున్న రాగి చెంబులో నీళ్లు గటాగటా త్రాగాను. తలంతా దిమ్ముగా ఉంది. ఓ వారం నుంచి వైరల్ ఫీవర్ వేధించి నిన్ననే నెమ్మదించింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చారువేసుకుని నాలుగు ముద్దలు తిని ఓ గ్లాసు మజ్జిగ త్రాగాను. రాత్రి ఎనిమిది గంటలకల్లా రెండిడ్లీ తిని, టాబ్లెట్స్ వేసుకొని, ఎనిమిదిన్నరకే పడకవేసాను. నిద్రబాగానే పట్టిందికాని, ఈ పిచ్చికల మెలకువ తెప్పించింది.

శ్రీవారు క్యాంపుకెళ్లి పదిరోజులు దాటింది. ఈ ప్రమోషన్ ఏమోగాని, ఏడాది నుంచి చాలా బిజీ అయిపోయారు. క్యాంపులే క్యాంపులు. ప్రమోషన్ రాకముందు ఆయన ఆఫీసు వదిలితే చాలు, ఇంటికొచ్చిపడేవారు. నన్నూ, పిల్లల్ని బాగా చూసుకునేవారు. నాకు ఇంటిపనిలో సాయం చేయడమేగాక, పిల్లల బాధ్యత కూడా వారే తీసుకునేవారు. ఈ ప్రమోషన్ వచ్చింది మొదలు నన్నేకాదు, పిల్లల్ని కూడా పట్టించుకోవటం మానేసారు. క్యాంపు నుంచి వచ్చినా ఇంటి పట్టున ఉండటం తక్కువైంది. ఆఫీసులో గడపడమే ఎక్కువైంది. ఇంటిలో ఉన్న కాస్తంత సమయం కూడా ఏవో ఫైళ్లు తిరగేస్తూ బిజీగా ఉంటున్నారు. అదేమని అడిగితే 'చూడు రాణీ! ఇక నుంచి ఇంటి బాధ్యతలు పూర్తిగా నీవే. జాగ్రత్తగా చూసుకో! ఇంతకుముందు నేను ఒకరి క్రింద ఉండేవాడిని. నాపై అధికారి చెప్పింది చేయడమే నాపని. అందువలన ఫ్రీగా ఉండేవాడిని. ఇప్పుడలా కాదు నేను ఒక ఉన్నత స్థాయికి చేరాను. నా క్రింది వాళ్లచేత పని చేయించడమే కాదు. మా కంపెనీ ఎం.డి. గారికి జవాబుదారీ కూడా నేనే. వృత్తిలో నిబద్ధత అవసరం. మరో మెట్టు చేరుకునే వరకూ కష్టపడక తప్పదు' అని స్పష్టంగా చెప్పి, బాధ్యతలన్నీ నా భుజాన మోపారు.

దూరంగా ఫ్యాక్టరీ సైరన్ వినిపించి నా ఆలోచనల నుంచి ఈ లోకంలోకి వచ్చాను. 'ఏమిటో మావారి ఆలోచనల్లో పడి అసలు విషయమే మరిచాను' అనుకుంటూ బాత్రూం వైపు నడిచాను.

ఏది ఏమైనా ఇటువంటి భర్త దొరకటం నా అదృష్టం. నా పిల్లలు కూడా బంగారం లాంటివాళ్లు. మా శిక్షణలో చక్కగా చదువుకుంటున్నారు. బాబుకు సైంటిస్టు కావాలని ఉంది. పాప టీచర్ కావాలని నిర్ణయించుకుంది. మేం

బి. విజయ

వాళ్ల అభిప్రాయాలను గుర్తించి, వాళ్ల లక్ష్యాల కనుగుణంగా ప్రోత్సహించడమేగాని మా ఆశలు, ఆశయాలు వాళ్లమీద రుద్దదలుచుకోలేదు.

ఎందుకో ఆకలిగా ఉంది. జ్వరం తగ్గటం వల్ల నోరు చేదు తగ్గి అన్నం తింటే బావుండు అనిపిస్తుంది. దాదాపు రెండు గంటలు కావస్తోంది. ఇప్పుడు తినకూడదు కూడా. ఉదయం లేచీ లేవగానే వేడివేడి ఇడ్లీలో మాడ్చినకారం వేసుకుని తింటే బావుంటుంది. వేడివేడి టీగాని, పాలుగాని తాగుదామని వంటగదివైపు అడుగులు వేశాను.

ముందుగా పాపాయి రూము. పాపాయి వాళ్ల నాన్నమ్మ ప్రక్కలో ముడుచుకొని పడుకుంది. దానికి వాళ్ల నాన్నమ్మ ఉంటే చాలు ఇంకెవరూ అక్కరలేదు. దానికి ఎన్ని డౌట్లో. దాని సందేహాలు తీర్చటం నా వల్ల కాదు. నేను విసుక్కుంటే అత్తయ్య ఒప్పుకోదు. ప్రశ్నలవల్లే పరిజ్ఞానం పెరుగుతుందంటారు. ప్రతి ప్రశ్నకి విడమరిచి చక్కగా సందేహం తీరుస్తుంది అత్తయ్య.

అలా ఆలోచిస్తూనే వంటగదివైపు నడుస్తున్నాను. బాజిగాడు మంచినీళ్ల జగ్‌తో వంటగది నుంచి తన రూమువైపుకు వెళ్లడం గమనించాను. ఈ మధ్యకాలంలో వీడిరూములో పన్నెండు దాటాక కూడా లైట్ వెలుగుతూనే ఉంటోంది. చాలాసార్లు గమనించానుగాని, నా జ్వరం బాధతో నీరసంగా ఉండి ఈ మధ్య చెప్పలేకపోయాను. అంతకుముందు పది దాటాక లైటార్పి పడుకోమని రెండుమూడుసార్లు



హెచ్చరించానుగాని, వాడు పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. పోయినసారి ఆయన వచ్చినపుడు తన దృష్టికి తీసుకువెళ్లాను. ఆయన దానిని సీరియస్‌గా తీసుకోకపోగా "పిల్లవాడు పెద్దవాడవుతున్నాడు గదా! వాళ్లకు స్వంత వ్యక్తిత్వం ఏర్పడే సమయమిది. అలాగే ఎదగనీ. మన పిల్లలు బంగారం. మరీ ఆంక్షలు పెట్టకు, అనుమానించకు. పన్నెండు దాటాక కూడా చదువుతున్నాడేమో! లేదా కంప్యూటర్ సీయింగ్‌లో కొంతసేపు ఎంజాయ్ చేస్తున్నాడేమో" అన్నారు తేలిగ్గా తీసుకుంటూ.

టీ త్రాగి వంటింటి నుండి నా రూముకు వస్తూ వాడి రూమువైపు చూశాను. రూములో లైట్ ఇంకా వెలుగుతూనే ఉంది. లైటార్పేసి పడుకోమని వీడికి కాస్త గట్టిగా చెప్పాలనుకొని, నీరసంగా ఉన్నా, లేని ఓపికను తెచ్చుకొని వాడి రూము దగ్గరకు నడిచి, డోరు తట్టబోయేంతలో, లోపలి నుండి వీడిమాటలు గట్టిగా వినిపిస్తున్నాయి. వీడు ఎవరితోనో కబుర్లు చెప్తున్నాడు. ఇప్పుడు కబుర్లు ఏమిటి? అయినా నాకు తెలియకుండా ఇంటికి ఎవరినీ రానివ్వడే! అలాంటిది ఎవడిని తెచ్చి కబుర్లు మొదలు పెట్టాడబ్బా, అనుకుంటూ కిటికీ తలుపులు కొంచెం జరిపి, లోపలికి తొంగి చూశాను. మంచంమీద వీడొక్కడే కూర్చొని సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"నాకు మహా కోపంగా ఉందిరా! అది నన్ను ఇంతగా అవమానిస్తుందా? ఏదో ఒకటి చేయాలి. ప్రతీకారం తీర్చుకోవాలి.

ఆ...! ఒక్క క్షణం మాట్లాడలేదు అవతలి నుండి వచ్చే మాటలను వింటున్నట్లుంది. మళ్లీ వాడే రెస్పాండ్ అవుతూ 'అదీ... నువ్వు చెప్పింది కరెక్టురా! అలాగే చేస్తాను. ఏ అందం చూసుకొని అది మిడిసిపడి నన్ను కాదని అందో, అసలు నన్ను కాదని అనటమే కాకుండా నా శత్రువు ఆ ఎత్తుపళ్ల ప్రకాష్‌గాడిని లవ్ చేస్తోందో, ఆ అందం నాశనమైతే, అప్పుడు... అప్పుడురా! దాని పొగరు అణిగేది. లేకపోతే అది నా గురించి తేలికగా మాట్లాడుతుందా!... అవును, కరెక్ట్, నువ్వు చెప్పిందే కరెక్టురా! యాసిడ్‌పోస్తా. దాని మొహాన్ని వికృతం చేస్తా. దాని అంతుచూసిగాని వదలను. ఈ యశస్విగాడంటే అది భయపడాలి. టెర్రర్... టెర్రర్ కలిగించాలి. దానికి నేనేంటో, నా పవరేంటో చూపిస్తా... సెల్‌ని విసురుగా ప్రక్కమీద విసిరేసి మంచందిగి డోర్‌వైపుకు నడుస్తున్నాడు. వాడిటు రావటం గమనించి, నేను వెంటనే వెనుదిరిగి మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ నా గది వైపుకు రెండడుగులు వేసి ఎందుకో మళ్లీ వాడి గది దగ్గరకు చేరాను. మళ్లీ వాడి మాటలు వినిపిస్తున్నాయి.

"నాకు సపోర్ట్‌గా నువ్వుంటే చాలురా. ఇది నాకొకలెక్కా! మళ్లీ గ్యాప్. అవతలి వాడి మాటలు వింటున్నట్లుంది. అంతే... అంతే ఇప్పుడొద్దులే. ఒక్క నెలపాటు ఏమీ మాట్లాడొద్దు. మనం మంచిగా ఉందాం. మనం పగబట్టినట్లు దానికి... దానికే కాదు ఎవ్వరికీ తెలియనీయవద్దు. మొన్నటి దెబ్బకే జాగ్రత్తపడుతుంది. తెలిస్తే రభసచేసి అల్లరిపెట్టవచ్చు. మనం అనుకున్నది జరగదు. బాగా నమ్మకం కుదిరాక, అది కూడా అంతా ఎగ్జామ్స్ హడావుడిలో బాగా బిజీగా ఉన్నప్పుడు ఈ పని కానిద్దాం. ఇంకెంత ఒక్క నెలే కదా! ఓపికపడదాం. అప్పుడు... దాన్ని... సెల్ కట్ అయిపోయింది. షిట్... ఛార్జింగ్ అయిపోయిందనుకుంటూ... ఈ వెధవ సెల్ అవసరమైనప్పుడే పనిచేసి చావదు అంటూ దాన్ని విసిరేసి లైట్ ఆఫ్‌చేయదానికి, మళ్లీ మంచం దిగి స్విచ్‌బోర్డువైపుకెళ్లటం కిటికీ

నుంచి చూశాను. తిరిగి నా గదికి చేరుకు న్నాను.

నాకంతా అయోమయంగా ఉంది. ఇది కలో, నిజమో అర్థం కావటం లేదు. ఒక రక మైన నిస్సత్తువ నన్ను ఆవహించింది. అసలు వీడు నా కొడుకేనా? ఇలా ప్రవర్తిస్తున్నాడేంటి? నిన్నమొన్నటి వరకూ మా చిటికెనవ్రేలు పట్టుకొని కొన్నాళ్ళు, ఆ తరువాత మా చూపుడు వేలు పట్టుకొని మరికొన్నాళ్లు మా ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా నడిచిన పిల్లవాడు ఒక ఆడపిల్ల గురించి అసహ్యమైన పదజా లంతో మాట్లాడటమేమిటి? యాసిడ్ పోస్తాడా? ఏ పిల్లవాడిని చూసుకొని, నేను, నా భర్త పొంగిపోతున్నామో అలాంటి మా బిడ్డ... నా బంగారు తండ్రి, కాబోయే యువశాస్త్రవేత్త పరాయి పిల్లమీద యాసిడ్ పోస్తాననటమా? నాకు భయం వేస్తోంది. దుఖం కలుగుతోంది. గుండెలు మెలితిప్పినంత బాధ. కడుపులో నిప్పులుపోసి అటూఇటూ త్రిప్పినంత మంటగా ఉంది. నా మీద నాకే అసహ్యం వేస్తోంది. వాడు ఇందాక అన్న మాటలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి. నా కొడుకు నాకు కోరలు, కొమ్ములు లేని రాక్షసుడిలా కనిపిస్తు న్నాడు. నాకు తెలియకుండానే నాకళ్లు వర్షిస్తు న్నాయి. తలపగిలిపోతోంది. జ్వరం వల్ల ఒక వారం నుంచి తిండి లేదు. అది ఒక నీరసం. దానిని తోడు జ్వరం తగ్గాక వచ్చే ఆకలి. ఆ నీరసంతోపాటు నా కొడుకు పిడుగుపాటులాంటి మాటలకు మరింత నీరసమై ఒక రకమైన నిస్సత్తువ ఆవహించి, నా గుండెలో సన్నగా నొప్పి మొదలైంది.

తలుపుతీసి, వాడిచెంపలువాయించి, వాడి ని ఇంటినుండి బైటికి నెట్టకుండా, నేను ఎందు కు వెనుదిరిగి వచ్చానో నాకే అర్థం కావటం లేదు. వాడిని 'ఇటువంటి నీచమైన పనులకు ఎందుకు తలపడుతున్నావురా?' అని ఎందుకు నిలదీయలేకపోయానో నాకే అర్థం కావటం లేదు. ఒక ఆడపిల్లమీద యాసిడ్ దాడి చేస్తాననే స్థాయికి వాడెలా ఎదిగాడు? అంతటి పరిస్థితి వాడికెందుకువచ్చింది? అసలు ఇంతవరకూ తీసుకొచ్చిన గొడవలేమిటి? ఆ ప్రకాష్ గాడె వడు? ఆ అమ్మాయి ఎవరు? ఇవన్నీ అడిగి నిలదీసి, తిట్టి, గొడవచేసి వాడిని ఈ రాక్షస కార్యానికి పూనుకోనీయకుండా వాడిని ఆప కుండా నేను ఎందుకు ఇటు నా గదిలోకి దూ రాను. ఒక తల్లిగా నా బాధ్యత ఏమిటి? నేను ఏం చేయాలి? ఈ దుష్టకార్యాన్ని నిర్వహించ కుండా నా కొడుకుని ఎలా ఆపాలి? వాడిని నేను ఎలా రక్షించుకోవాలి? వీడి దాష్టికానికి బలైపోయే ఆ ఆడపిల్లను ఎలా కాపాడాలి? నా పిల్లవాడిని సరియైన మార్గంలో ఎలా పెట్టాలి? ఈ అమ్మాయే కాదు, వాడు మరే అమ్మాయి జోలికి పోకుండా ఇటువంటి నీచ ప్రవృత్తి వాడిలో ప్రోదికాకుండా నేను ఎలా కాపాడాలి? వాడిని సరియైన మార్గంలోకి ఎలా పంపాలి? ఒకటే ఆలోచనలు... తల పగిలి పోతోంది.

ఎంత అదృష్టం... అవును, ఎంతటి అదృ ష్టం. నేను వినబట్టి సరిపోయింది. లేకపోతే వాడు రేపోమాపో ఆ అమ్మాయి మీద దాడిచేసే వాడు కదా! దాడి చేసినట్లయితే... వామ్మో! ఎంత దురాగతం. యశస్వి! ఆ అమ్మాయిమీద యాసిడ్ పోసినట్లు, ఆమె ముఖం కాలిపోయి నట్లు, పోలీసులు వీడిని అరెస్టుచేసి తీసుకెళ్తు న్నట్లు, మావాడి (చర్యకు) దురాగతానికి వ్యతిరే కంగా ధర్నాలు, బంద్‌లు చేయటం, జనం మా వెంటబడి మమ్మల్ని తరుముతున్నట్లు, మమ్మల్ని కొడుతున్నట్లు, మేం పారిపోతున్నట్లు, మా ఒంటి నిండా దెబ్బలు... ఎవరో కొంత

మంది మా పాపని పట్టుకొని యాసిడ్ పోయ బోతుండటం, మా పాప తనమీద యాసిడ్ చల్లవద్దని, వాళ్ల కాళ్లుపట్టుకొని బ్రతిమాలు తున్నట్లు... ఓర్నాయనో... అది కలో, మగత నిద్రో తెలియదుగాని, నాకు ఈ దృశ్యాలన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి.

అసలు ముందుగా నేను చేయవలసిన పని మావారిని రప్పించడం. అమ్మో! ఆయనవచ్చి పిల్లవాడు ఈ స్థాయికి వచ్చేవరకూ ఏం చేస్తు న్నావు? మన చూపుల కంచె వాళ్ల చుట్టూ ఉండి కాపాడుకోవాలని చెప్పాను గదా! పిల్లల బాధ్యత చాలా బాగా నిర్వర్తించావులే...! అంటే ఏం చెప్పాలి? అసలు ఈ సమాధానాలు, సంజాయిషీలు కాదు. ఒక పరాయి ఆడపిల్ల జీవితాన్ని మాడి మసిచేయదలచిన ఆలోచన లేమిటి వీడికి? నేను వీడిని కన్నట్టే, పాపం ఆ అమ్మాయిని ఆ తల్లి కూడా కన్నది కదా! నాలాగే ఆమె కూడా తన బిడ్డమీద ఎంత ప్రేమను పెంచుకొని ఉంటుందో కదా! ఆ బిడ్డ గురించి ఎన్ని కలలుకంటుందో గదా! అటువంటి సుకుమారమైన సాటి విద్యార్థినిని వీడు ప్రేమించమని అడిగినవెంటనే ప్రేమించనం దుకు, వీడిని వద్దని ఆమె మరొకరిని ప్రేమించి నందుకు వీడు ఇచ్చే శిక్ష ఇదా! అసలలా జరి గితే ఆ తల్లి గర్భశోకాన్ని ఎవరు తీర్చగలరు? సాటి స్త్రీకి గర్భశోకాన్ని కలిగించే రాక్షసుడిని కన్నతల్లినా నేను? నేను, నా కుంటుంబం ఎన్ని వేల నోళ్లల్లో నానాలో కదా! వాడు ఎంతో కఠిన మైన శిక్ష అనుభవించాలి గదా? వాడిని జైలు నుంచి బయటకు తేలేక, వాడిని ఆ దశలో చూడలేక, వాడి చర్యను సమర్థించలేక ఎంత తల్లడిల్లిపోవాలో కదా! ఎన్ని అనర్థాలు? మావల్ల ఒక కుటుంబం ఎంతటి నష్టాన్ని అనుభవిం చాలి? నానారకాల ఆలోచనలు కలగాపుల గంగా వచ్చిపోతున్నాయి. నన్ను భయపెడు తున్నాయి. ఇబ్బంది పెడుతున్నాయి. సరియైన నిర్ణయానికి రాలేకపోతున్నాను. మంచం మీద నిస్సత్తువగా అలా పడుకుని ఆలోచిస్తూనే ఉన్నాను. ఒకరకమైన మగత. కళ్లముందు కలలా ఏవో దృశ్యాలు...

ఏది ఏమైనా ఈ దుష్కృత్యాన్ని ఆపాలి. అర్జంటుగా వారిని పిలిపించాలి. వాడిని నిల దీసి, 'ఇటువంటి పొరపాటు ఆలోచన చేయను' అని హామీ ఇచ్చేవరకూ వదలకూడదు. నయా నో భయానో వాడిలో మార్పు తేవాలి. ఒక విధంగా తను వెనుదిరిగి రావటమే మంచి దైంది. తొందరపడవలసిన వ్యవహారం కాదిది. అసలుకే మోసం వస్తుంది. అలాగని తాత్సా రమూ చేయకూడదు. అసలు వీడెందుకిలా తయారయ్యాడు? మాపెంపకంలో లోపమా? మాలో అటు గాని, ఇటు గాని అటువంటి స్వభావం గలవారేలేరు. వీడుకూడా ఈమధ్యనే మారాడు. అంతా ఒక అయిదారు నెలల్లోనే మార్పు. వారు బిజీగా ఉండటం, నేను పిల్లల పట్ల అతినమ్మకం పెంచుకొని పట్టించుకోకపోవ టమే కారణం.

ఎంతకూ నిద్ర రావటం లేదు. ఏవేవో ఆలో చనలు ఇంకేవో ఊహలు. పిచ్చిపిచ్చి సంఘట నలు కళ్లముందు కదలాడుతున్నాయి. ఇక లాభం లేదని, మెల్లగాలేచి, చన్నీళ్లతో మొహం కడిగి, రెండు బ్రెడ్‌ముక్కలుతిని, వేడివేడి పాలు త్రాగి కాస్తంత ఓపిక తెచ్చుకున్నాను.

నాలుగ్గంటల సమయం... ఆయనకు ఫోనుచేసి, నాకు జ్వరం మరీ ఎక్కువైందని, చాలా భయంగా ఉందని, తనని చూడాలని ఉందని, వెంటనే రావలసిందే... అంటూ ఏడ్చే శాను.

అసలు ఆయనతో మాట్లాడుతుంటేనే

ఏడుపు తన్నుకొచ్చి ఏడుస్తున్నాను. కంగారు పడవద్దని, ఐదు గంటల బస్‌కి బయలుదేరు తున్నానని ధైర్యం చెప్పి, ఫోను పెట్టేసారాయన. అప్పటిగ్గాని నా మనసు ఫ్రీ కాలేదు. తలభారం తగ్గింది. కాస్తంత రిలీఫ్ ఏర్పడింది. ఆయన రాకకోసం నిరీక్షిస్తూ రోజువారీ కార్యక్రమంలోకి తలదూర్చాను. నా మనసులో రాత్రి సంఘటన తాలూకు ఆలోచనలు, భయాలు వదలకుండా అలాగే ఉన్నాయి. ఆయనొచ్చి చూసుకుంటా రులే అని కొండంత ధైర్యం.

ఉదయం లేచినప్పటి నుంచి నేను ఏమీ జరగనట్లు చాలా మామూలుగా ఉండడానికి ప్రయత్నించాను. ఎంత దాచుకుందామను కున్నా నా మొహంలో భావాలు దాగడం లేదు. ఈ విషయాన్ని అత్తయ్య గమనించింది. మధ్యా హ్నం భోజనాలయ్యాక, కాస్తంత విశ్రాంతి తీసుకొని, నాలుగ్గంటల సమయంలో మధ్య ఇంటి సోఫాలో కూర్చుని "రాణీ! ఇలా రామ్మా" అన్నారు. పిల్లలిద్దరూ ఇంటిలో లేరు. ఏంట త్తయ్యా అంటూ వెళ్లాను. 'రా ఇలా కూర్చో' అంటూ ప్రక్కన కూర్చోబెట్టుకున్నారు. 'ఉదయం నుంచి అలా ఉన్నావేంటి? రాజా రాలేదని దిగులా' అన్నారు. కాదన్నట్లు తలాడించాను. 'ఫోను చేస్తే వాడేమైనా అన్నాడా' అంటూ నా ఎడమచేతిని తన చేతిలోకి తీసుకొని తన చెంప కానించుకున్నారు ప్రేమగా. ఆమె అరచేతిని అలా అందుకోగానే నా గుండెల్లో నుంచి దుఃఖం తన్నుకువచ్చింది. పెదాలమధ్య అదిమిపట్టాను. ఎంత ఆపుకుందామన్నా ఆగడంలేదు.

'ఎందుకలా ఉన్నావు. ఏదో జరిగింది. దాచుకుందామనుకున్నా దాచుకోలేకపోతు న్నావు. చెప్పు నాన్నా?' అన్నారు అత్తయ్య లాలనగా.

మానాన్నలాగే అత్తయ్య 'చెప్పునాన్నా!' అనగానే అత్తయ్యఒడిలో తలపెట్టి భోరుమని ఏడ్చాను. అత్తయ్య ఏమీ మాటాడలేదు. అలాగే నావీపు నిమురుతూ, ఫ్యానుగాలికి ఎగురుతున్న నావెంట్రుకలు సరిచేస్తూ నేను చెప్పిందంతా విన్నారు. రాత్రి జరిగిందంతా విని, 'ఓస్! ఇంతోటి దానికి వాడు రావాలా! నేను లేనూ! నీవేం భయపడవద్దు. నేను చూసుకుంటాను గదా! లేచి టీపెట్టు. ఫ్రెషయి టీతాగి హ్యాపీగా ఉండు. నేను డీల్ చేస్తానులే' అన్నారు భరోసా ఇస్తూ.

* * *

యశస్వి కాలేజీకి బయలుదేరాడు. బుక్స్ తీసుకుని అలా గడపదాటాడో లేదో ఏడుస్తూ మా పాపాయి ఎదురొచ్చింది. ఏం జరిగిందబ్బా అంటూ నేను వెళ్లేసరికే అది వాడి చేతిలో ఏదో కాగితాన్ని ఉంచి, ఏదో చెప్తోంది. వాడు దాన్ని చదివి సీరియస్‌గా నా చేతికిచ్చాడు.

"ఏంటమ్మా ఇది?" అన్నాను.

"దీనికి ఎవడో వెధవ లౌలెటరు వ్రాశాడట మమ్మీ" చాలా సీరియస్‌గా అన్నాడు నాతో.

"అంతేకదా! దానికింత ఏడవం ఎందుకు? నువ్వు అంత సీరియస్ కావటం ఎందుకు? నువ్వంటే ఇష్టం లేదని డైరెక్ట్‌గా ఆ వ్రాసినవాడికి చెప్పెయ్. లేదా మాకు చెప్పు. మేం చెప్తాం" అన్నది అత్తయ్య కాఫీ సిప్‌చేస్తూ వచ్చి అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ. నాకు వెంటనే అర్థ మైంది. ఇది అత్తగారి డ్రామా అని.

"అరె! ఇంత చిన్న విషయానికి ఏడవటం ఎందుకురా? మేము లేమా! ఊర్కో" అన్నాను దాని కళ్లుతుడుస్తూ.

"అదికాదమ్మా! ఇది ఆరో లెటరు. వాడే విసిగిపోయి ఊరుకుంటాడని, నేను పెద్దగా

పట్టించుకోలేదు. చింపేసాను. ఈ లెటరు చాలా అసహ్యంగా వ్రాసాడు. నేను ఎవరికీ చెప్పనని, ఏమీ చేయలేనని ధీమా వచ్చింది వెధవకు" అన్నది కళ్లు తుడుచుకుంటూ వాళ్ల నానమ్మకేసి చూస్తూ.

"ఇంతకీ ఎవడువాడు?" అడిగాడు సీరియస్‌గా యశస్వి. ఏమో అన్నయ్యా! వాడు పేరు వ్రాయటం లేదు. కాని, నా మీద కన్నేశాడు. మొదటి రెండు లెటర్లూ ఫరవాలేదు. మూడో లెటరు నుండి వాడి పైత్యాన్ని పెంచాడు. వాడి వరస కూడా మారింది. నేను వాడి లెటర్స్‌కి రిప్లయి ఇవ్వకపోవటం వల్ల చాలా ఫీలయ్యాడట. పైగా నేను మా క్లాసులో ఎవరినో చూసుకున్నానని వాడికి డౌటుగా ఉందట. అందుకే వార్నింగిస్తూ వ్రాశాడు" అన్నది భయం భయంగా.

"ఏమని ఇచ్చాడేంటి" అన్నాడు సీరియస్‌గా యశస్వి. వాడిస్వరం మారింది. గద్దించి అడిగాడు.

"ఈ లెటర్‌కి రిప్లయ్ ఇవ్వకపోతే నేను వాడిని కాదని మా క్లాస్‌లో ఎవరినో ఇష్టపడుతున్నట్లు ఖాయం చేసుకుంటాడట" ఒక్కొక్క మాట కూడదీసుకుంటూ చెప్పింది.

"చేసుకుని..." వెంటనే అందుకుని ఆత్రంగా అడిగాడు. వాడు చెల్లి గురించి టెన్షన్ పడుతున్నాడు. నేను అత్తయ్య ప్రేక్షకపాత్ర వహించాం.

"వాడు వాడిని చంపేస్తాడట" అన్నది కళ్లింత చేసి భయవిహ్వాలమై.

"అంతేకదా! దానికి నువ్వు భయపడతావెందుకు నాన్నా!" అన్నారు అత్తగారు దగ్గరకు తీసుకుని దాని మెడచుట్టూ చేయివేస్తూ. "చంపేది వాడు. చచ్చేది ఇంకెవరో! చస్తేచావనీ, ఇద్దరి పీడ వదులుతుంది. ఇంత చిన్న వయస్సులోనే లవ్వట లవ్వు. వెధవలకి" అన్నారు అత్తయ్య ఈసడిస్తూ యశస్వికి తగలాలనే వ్యంగ్యంగా.

"అవునమ్మా! ఎవరో ఆకతాయితనంగా నిన్ను ఏడిపించటానికో, లేదా ఉడికించటానికో వ్రాసి ఉండవచ్చు కదా! ప్రేమించానని తన పేరు చెప్పకుండా ఆకాశరామన్న ఉత్తరం వ్రాసిన వెధవ ఏం చేయగలడు. వదిలెయ్ అమ్మా! టేకిట్‌ఈజీ" అంటూ "చిన్నా! ఇక నువ్వు కాలేజీకి వెళ్లునాన్నా" అంటూ పాప భుజంమీద చేయివేసి లోపలికి నడవబోతూ అత్తగారివైపు అర్థమైంది అన్నట్లు చూసి నవ్వాను.

* * *

సాయంత్రం నాలుగ్గంటలవేళ... వాతావరణం ప్రశాంతంగా ఉంది. క్యాంపు నుంచి వారు తెచ్చిన బాదంహల్వాతో పాటుగా నేను వేసిన పకోడీలు తింటూ, టీపాయ్‌మీద కోకోకోలా త్రాగుతూ తండ్రి కొడుకులు కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎదురుగ్గా ఉయ్యాల బల్లమీద కూర్చొని మాటలు వింటూ మల్లెలు మాలకడుతున్నాను. అత్తయ్య ఆదేశానుసారం వీడి వ్యవహారాన్ని ఇంకా ఆయన ముందుంచలేదు. అవసరమైనప్పుడు తానే తన కొడుకుముందు పెడతానని, అంతవరకూ నన్నేమీ చెప్పవద్దని ఆజ్ఞాపించారావిడ. అందుకే వాతావరణం ఇంత ప్రశాంతంగా ఉంది. వాడి ఫ్రండ్ రాజుగాడి గురించి వీడేదో చెప్తున్నాడు. ఆయన తింటూ వింటున్నారు. ఈలోగా పాప పెద్దగా ఏడ్చుకుంటూ వచ్చింది.

"ఏంటమ్మా! మళ్లీ లవ్‌లెటరా?" అంటూ

దానిచేతిలోని పేపర్ని తీసుకుంది అప్పుడే అక్కడికివచ్చిన అత్తయ్య. 'మళ్లీ డ్రామా మొదలైంది' అనుకుంటూ నాలో నేనే నవ్వుకున్నాను.

"లవ్లెటరేంటమ్మా" అన్నారాయన లేచి పాపవైపు నడుస్తూ హడావుడిగా.

"వాడు నన్ను చంపేస్తాడట నాన్నమ్మా" అన్నది పాప భయపడుతూ.

"అబ్బో అంత ధైర్యమా? పేరు కూడా వ్రాయడానికి భయపడే ఆకాశరామన్నకు" అన్నారు అత్తయ్య హాస్యంగా.

"ఎవరో మీ తరగతిలో అమ్మాయే నిన్ను ఉడికిస్తోందిలేరా... భయపడకు" అన్నాను అనునయిస్తూ.

"లేదు మమ్మీ! పేరు కూడా వ్రాశాడు. మా క్లాస్లో నెం. 22 వెంకట్గాడు" అన్నది ఉత్తరాన్ని వాళ్ల నాన్న చేతికిస్తూ.

"వీడెవడో లవ్లెటర్సు వ్రాసి మన బుజ్జిని ఏడిపిస్తున్నాడు డాడీ! నువ్వు వెళ్లేలోగా ఈ వ్యవహారం సెటిల్ చేయాలి డాడీ" అన్నాడు యశస్వి.

"ఇంతకీ వాడెవడో తెలుసా బుజ్జీ" అన్నారు అత్తగారు.

"ఎం.ఆర్.ఓ. ఆఫీసులో వీళ్ల డాడీ పనిచేస్తారట" అంది వాడి వివరాలు అందిస్తూ. క్లాసుకు సరిగ్గా రాడు, చదవడు, బ్యాడ్బాయ్. వీళ్ల డాడీ, మా ప్రిన్సిపాల్గారు చిన్నప్పటి నుంచి ఫ్రండ్స్ అట. అందుకే పెద్దగా పట్టించుకోరు. 'వాళ్ల నాన్నమ్మ డైరెక్షన్లో ఇది బాగానే నటిస్తోంది. మొత్తానికి కథ క్లయిమాక్స్కి చేరుకుంటోంది' అనుకున్నాను.

నేను రేపు ఉదయం వెళ్లి వాళ్లడాడీతోటి, మీ ప్రిన్సిపాల్తోటి మాట్లాడుతాలే నాన్నా! భయపడకు అన్నారు ఈజీగా తీసుకుంటూ.

ఏంటండీ! రేపు మాట్లాడేది? ఒక్కసారి అలా వెళ్లి వార్నింగ్ ఇచ్చిరండి. చదివేది పన్నెండో క్లాసు. లవ్వట లవ్వు వెధవకు. పైగా బెదిరింపు! చంపేస్తాడూ గుంటవెధవ. వేలెడంత ఉండడు" అన్నాను లేనికోపాన్ని తెచ్చిపెట్టుకుంటూ.

"కాదు మమ్మీ! నామీద యాసిడ్ పోసి కసి తీర్చుకుంటాడట. నేను వాడినే ప్రేమించాలట. ఇంకెవడివైపూ చూడకూడదుట. తేడా వస్తే యాసిడ్ పోస్తా లేదా చంపుతానంటూ వ్రాశాడు" ఏడుస్తోంది పాప.

"లేదులేమ్మా! ఏదో చిన్నతనం కదా! అటూ ఇటూ కాని వయసు. పదోతరగతి వరకూ అమాయకంగా ఉంటారు. పెద్దలు చెప్పినట్లే నడుస్తారు. డిగ్రీకొస్తే పరిణతి మొదలవుతుంది. ఒక్క ఈ ఇంటరే అటూఇటూకానిది. పిల్లలు దారితప్పే వయసు... సైకాలజీ ప్రకారం" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్నారు. అప్పటికి ఉత్తరం చదవటం పూర్తయింది. ఇది నాటకం అని తెలిసినా నాకు బాధకలుగుతోంది. దుఃఖం వస్తోంది. యశస్వి ఆనాటి రాత్రి సెల్లో మాటాడిన మాటలే జ్ఞప్తికివచ్చి నా గుండెను కోస్తున్నాయి. అంతే ఒక్క పెట్టున లేచాను మావారి మీదకు.

"ఏంటండీ కథలు చెప్తున్నారు. యాసిడ్ పోస్తాడట... యాసిడ్. నాకు కడుపు మండుతోంది. ఈ వెధవ ప్రేమించమంటే ప్రేమించాలా? ఇష్టం లేకపోతే ఇష్టంలేదని చెప్పకూడదా! వీడిని ప్రేమించి, మోసంచేస్తే చావాలి. పెళ్లిచేసుకుని హింసపెడితే భరించాలి. ఇలాంటి వెధవలను కన్నందుకు..." నా గొంతు

బొంగురుపోయింది... ఏడ్చేస్తున్నాను.

వారు వెంటనే ఖంగారుగా వచ్చి, నా భుజం మీద చేయివేసి "రాణీ! ఎందుకింతలా ఏడుస్తున్నావు. ఆగు నువ్వు చెప్పినట్లే చేద్దాం" అన్నారు బుజ్జగిస్తూ.

పాప, 'మమ్మీ... డాడీ...' అంటూ అదీ ఏడుస్తోంది. వాళ్లన్నయ్య ప్రవర్తన దానిని చాలా బాధించింది. అన్నయ్య పాడైపోతున్నాడనే బాధతో పాటు వాడికేదో అవుతుందనే భయంకలిగి ఏడుస్తోంది. మన రాష్ట్రంలో జరుగుతున్న యాసిడ్ గొడవలు, ప్రేమించలేదని అమ్మాయిలను చంపటాలు వాటి ఫలితాలు ఆ కుటుంబాలపైపడే విధానాన్ని టీవీలోచూస్తూనే ఉంది కదా! అందుకే అంతగా భయపడుతోంది.

"ఊరుకో రాణీ, ఊరుకో బుజ్జీ! మీరు కాస్త నెమ్మదించండి" అన్నారు అత్తయ్య.

"ఇంతచిన్న విషయానికి..." అంటూండగానే వాళ్లనాన్నను యశస్వి వారించాడు. "డాడీ! నువ్వలాగుండు. అసలు వాడు మనల్ని ఏమనుకుంటున్నాడు. నాకొడుకు నాచెల్లెల్నే కాదు... ఇంక ఏ ఆడపిల్లవైపూ కన్నెత్తిచూడకుండా ఇరగదీస్తాను" అంటూనే సెల్‌తీసి ఏవో నెంబర్లు నొక్కుతూనే పళ్లుపటపటకొరుకుతూ "వీడెమ్మ... వీడికి లవ్వు కావాలా. నా బ్యాచ్‌ని దింపుతానుచూడు. చిటికేస్తే... చిటికెలో లేపేస్తారు. ఆ తరువాత స్టేషన్లో చూసుకుందాం అంటూనే...

"హలో సందీప్! ఆ రాఘవగాడూ..." వాడేదో చెప్పబోతుండగా ఆయన వాడి చేతిలోని సెల్‌ని లాక్కుని కట్ చేసారు.

"వాడికింకా మాసంగతి తెలియదు. నా కొడుకుని నరుకుతా. ముక్కలు ముక్కలుచేస్తా. వీడెబ్బ..." అప్పుడు చూసాను వాడికళ్లల్లో కసి. ముఖమంతా ఎర్రగా కందగడ్డలా మారింది. పిడికిళ్లు బిగుసుకున్నాయి. ఊగిపోతున్నాడు. అసలు వాడినోటినుండి అన్‌పార్లమెంటరీ వర్డ్స్ రావటం అదే మొదటిసారి.

ఆయన కొడుకువైపు ఆశ్చర్యంగా చూసారు. "ఏమిట్రా? ఎందుకంత కోపం? ఆవేశపడటం మంచిది కాదు. ఆలోచించాలి" అంటూ నావైపు తిరిగి "ఏమిటి రాణీ! నాలుగురోజులపాటు పిల్లల బాధ్యత నీకు అప్పగిస్తే ఈ గొడవలేమిటి?" అంటూ బాబుతో "తప్పు యశస్వి తప్పు అలా అనకూడదు. ముందు నీ భాష మార్చుకో" అన్నారాయన మందలింపుగా.

"ఇంకెలా ఉండాలంట? నా చెల్లెల్ని వాడు మసిచేస్తాడట. యాసిడ్ పోస్తాడట. చెప్తా... వాడి పనిచెప్తా. అసలా లంజాకొడుకుని" అంటూనే వాళ్ల డాడీ చేతినుంచి సెల్ లాక్కున్నాడు.

"ఏంట్రా! చాలా నెమ్మదిగా ఉండేవాడివి. ఈ భాషేమిటి? ఈ కోపం ఏమిటి? ఈ సర్కిల్ ఏంటి? నీ బిహేవియర్ బాగోలేదు. ముందది మార్చుకో" అన్నారు సీరియస్‌గా.

"ఏంటి మార్చుకునేది? ముందు నా కొడుకుని నరికేస్తా. ఆ తరువాత మీరు చెప్పేది వింటా" అంటూ మళ్లీ నెంబర్లు నొక్కుతున్నాడు.

"అయితే వాడిని నరికేస్తావేంట్రా" అన్నారు అత్తయ్యగారు అమాయకంగా రెచ్చగొడుతూ. ఇక మేమంతా ప్రేక్షకపాత్ర వహించాల్సిందే.

"కాక ఊరుకోమంటావా నానమ్మా? వాడు భయపెట్టింది మన చిన్నిని" చెల్లిమీద అపారమైన ప్రేమను వ్యక్తపరుస్తూ అన్నాడు.

"మరి నిన్నెవరు నరకాల్రా?" చాలా సూటి

గా, సీరియస్‌గా, స్వరంపెంచి నిలదీస్తూ అడిగారు.

అమ్మయ్య... శ్రీవారి ముందుకు అసలు విషయం వెళ్తోంది. ఇక ఆయన రంగంలోకి దిగుతారు. అత్తయ్య చాలా మంచిపని చేసింది. చిన్నీ తన పోర్షన్ పూర్తయినట్లు చాలా మామూలుగా ఉంది. నీ చెల్లెలికి ఒక ఉత్తరం ముక్క వస్తేనే నువ్వు ఇదవుతున్నావే! మరి నువ్వు ఎవరో అమ్మాయి మీద యాసిడ్ పోయడానికి రడీగా ఉన్నావే! ఈ విషయం తెలిస్తే వాళ్ల అన్నదమ్ములు, వాళ్ల అమ్మానాన్నలు నిన్నేం చేయాల్రా? యాసిడ్ పోసి ఎవరి బతుకు బుగ్గి చేయాలనుకుంటున్నావు? నీకైతే ఒక రీతి, ఎదుటివాళ్లకు ఇంకొక రీతినా? చెప్పు" అన్నారు ఆవేశంగా.

"నేను యాసిడ్ పోయడమేమిటి?" అమాయకంగా అంటున్నాడు.

"ఏరా! మాకేమీ తెలియదనుకుని అమాయకత్వం నటిస్తున్నావా? మీ అమ్మానాన్నలు నీకిచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేసావన్నమాట. నీమీద మేం పెంచుకున్న ఆశలేమిటో నీకు తెలుసు గదా! నీవు అందరి పిల్లల్లా ఇంజనీరో డాక్టరో అయి కోట్లు సంపాదించి అందిస్తావని కాదు. ఫలానా రామారావుగారబ్బాయి చాలా మంచివాడు అని అందరూ ప్రశంసించాలని. అందుకే నీ ఆలోచనలకు అభిప్రాయాలకు ఊతమిచ్చింది. కాని, నీవు మా నమ్మకాలను వమ్ము చేస్తున్నావు. చెడుస్నేహాలుచేసి, ఆ ప్రభావంతో నిన్ను నీవు మరిచి, మమ్మల్ని మరిచి అసహ్యకరమైన ప్రవర్తన, నీచమైన ఆలోచనలకు ఒడిగట్టావు" ఆవేశం నుంచి ఆవేదనలోకి మారింది అత్తయ్య గొంతు. పైటకొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటున్నారు.

"ఏంటమ్మా ఇది?" అన్నారాయన వాళ్లమ్మగారితో ఆశ్చర్యంగా, ఆవేదనగా.

"అవునండీ! వీడు మన కడుపున చెడబుట్టాడండీ! పదిరోజుల నుంచి మేం కడుపునిండా అన్నం తింటే ఒట్టు. కళ్లారా నిద్రపోయిందీ లేదు. వీడి వయసెంత? వీడెంత? వీడికి ప్రేమ కావాలి. వీడు లవ్ చేసిన అమ్మాయి, వీడిని కాదని ఎవరితోనో స్నేహం చేస్తుందట. అందుకని వీడు యాసిడ్ పోసి ఆ అమ్మాయి బ్రతుకు బుగ్గిపాలు చేస్తాడట. ఆ తరువాత వీడి జీవితం వీడితోపాటు మన కుటుంబం బుగ్గిపాలవుతుందని తెలియదు వీడికి. అంతా ఆవేశం. వీడి దుష్టబుద్ధికి వత్తాసునిచ్చే దుష్ట స్నేహితులు. అవతల ఆ పిల్ల తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఎంత తల్లడిల్లిపోతారో తెలియదు. యాసిడ్‌పోసి కసితీర్చుకుంటాడట. భవిష్యత్తును ఊహించని మూర్ఖుడండీ వీడు! ఇటువంటి రాక్షసుడిని కన్నందుకు నేను... నేను... యాసిడ్ తాగాలండీ!" నాకు తెలియకుండానే నానోటి నుంచి మాటలు, నా కన్నుల నుంచి నీరు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

"ఏంటి రాణీ! ఎందుకూ అలా ఏడుస్తున్నావు? కాస్త ఆగు" అంటూ నాకళ్లు తుడిచి, జుట్టుసవరించి, నాభుజం మీద ప్రేమగా చేయివేసి రెండవ చేతితో పాపను పొదివి పట్టుకొని... "ఏం నాన్నా! యాసిడ్ పోస్తావా! చాలా నెమ్మదిగా ఒక్కొక్క అక్షరం నొక్కుతూ అడిగారు. వాడు వంచిన తల యెత్తలేదు.

"చెప్పమ్మా! యాసిడ్ పోస్తావా?" ఎక్కడో తగులుతున్నాయి వాడికి ఈ మాటలు.

"అదికాదు డాడీ!" తల కొంచెం పైకెత్తి నిస్సహాయంగా అన్నాడు.

"ఏది కాదు తండ్రీ! నీచెల్లికి ఉత్తరం వ్రాస్తే నీవెంత ఆవేశపడ్డావో ఆమె కుటుంబ సభ్యులు

అంతకన్నా ఎక్కువ ఆవేశపడాలికదా! నీ చెల్లికన్నా ఎక్కువ ఆవేదన ఆ అమ్మాయి పడదూ... చెప్పు?" అన్నారు. వాడి కళ్లవెంట నీళ్లు. ఆయన వాడి గుండెని నొక్కుతున్న మాటలు వాడారు.

"ఎందుకురా ఏడుపు? వద్దండీ... వాడికేం చెప్పవద్దు. వాడు ఇంక చెయ్యిదాటాడు. పోనీయండి. వాడి జీవితం, వాడిష్టం. ఆ అమ్మాయిమీద యాసిడ్‌పోసి ఆపైన జైలుకెళ్లి ప్రజలంతా మన మొహాన ఉమ్మేసి... తన్ని, వెంటబడి తరుముతుంటే ఆ అవమానం భరించలేక మనమంతా ఆత్మహత్య చేసుకుంటే... అదీ వాడికానందం" అన్నాను వ్యంగ్యంగా.

"అదికాదమ్మా! ఆ అమ్మాయి నన్ను మోసం చేసింది" వాడు తనను తను సమర్థించుకుంటున్నాడు.

"మోసం చేసిందా?" వాళ్ల నాన్న.

"అవును. ముందు నాతో బాగా స్నేహం చేసి, ఇప్పుడు ఆ ప్రకాష్‌తో స్నేహం చేస్తుంది" అన్నాడు తనను తను సపోర్ట్ చేసుకుంటూ.

"అది మోసమా!" సూటిగా ప్రశ్నించారాయన.

"కాదా?" అన్నాడు వాడు.

"కాదు నాన్నా! ఆ అమ్మాయి నీతో స్నేహం చేయాలనుకుంది. చేసింది. నీవూ చేసావు. ప్రస్తుతం ఆమె కిష్టంలేదు. ప్రకాష్ అంటే ఇష్టం. ఆమె మనసు ఆమె ఇష్టం. ఆమె మాట్లాడిస్తే మాట్లాడు, లేదంటే లేదు. అంతే. అది ఆమె వ్యక్తిగత విషయం. ఆమె ఇష్టం" అన్నారాయన.

"అవునురా! అలాగే ఉండాలి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోకపోతే ఎట్లా" అన్నారు అత్తయ్య సలహాగా.

"అసలు వాడికేం చెప్పవద్దండి. పరాయి ఆడపిల్లను గౌరవించటం చేతకాని వెధవ. బాగా చదువుకుంటాడని, ప్రైవసీ ఉండాలని ఒక్కడికీ రూము ఏర్పాటు చేస్తే... అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండి... చదువుకోకుండా, వెధవలతో స్నేహంచేసి వెధవ ఆలోచనలు పెంచుకొని, చివరకు ఒక ఉన్మాదిగా... ఒక నీచుడిగా..."

ఎందుకమ్మా! అలా దుమ్మెత్తిపోస్తావు. ఏడవకు... ఏం ఫరవాలేదు. వాడు మారతాడు. మనచూపుల కంచె వాళ్లకు రక్షణగా ఉండాలి. ఈ మధ్యకాలంలో రామం ఉద్యోగంలో బిజీ కావటం, నీ ఆరోగ్యం సరిగాలేకపోవటం, పిల్లలమీద నీకు అతినమ్మకం ఉండటంవల్ల పట్టించుకోలేదు. ఇప్పుడు వాడికి నాలుగు పక్కలా నాలుగు స్తంభాల్లా తల్లీ, తండ్రీ, చెల్లి, నాన్నమ్మ ఉన్నారు. వాడు మారతాడు. మార్చుకుంటాడు. ఏడవకు. ఏం పరవాలేదు" ఓదారుస్తూ అన్నారు అత్తయ్య.

"అన్నయ్యా! తాతయ్య ఒకసారి ఏం చెప్పారో గుర్తుకుతెచ్చుకో. అదే నువ్వు కాలేజీలో చేరే రోజులు అనుకుంటాను మన చుట్టూ ఈనాడు మంచి వాతావరణం లేదు. మనిషిని బలహీనుడినిచేసి పెడత్రోవ పట్టించే సాహిత్యం, సినిమాలు, వ్యక్తులు మొదలైనవి అన్నీ ఉన్నాయి. మన మనస్సు హంసలా ఉండాలి. హంస ఏ విధంగా పాలుమాత్రమే త్రాగి, నీటిని వేరు చేస్తుందో మనం కూడా మంచిని మాత్రమే గ్రహించి, చెడుని వదలి రాజమార్గంలో నడచి మహారాజుల్లా మంచివ్యక్తుల్లా తయారు కావాలి. ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో... ఇకముందు

ఇలాంటి బ్యాడ్ హ్యాబిట్స్ మానేస్తానని ప్రామిస్ చేయి" అన్నది.

"అన్నయ్య సహజంగా మంచివాడురా. ఇవన్నీ మధ్యలో వచ్చిన అవగుణాలు. ఇప్పుడు మనం పడిన బాధ చూసాడు గదా! మార్చుకుంటాడులే" అని పాపాయితో అని, "చూడు చిన్నా! మీ క్లాసులో రకరకాల ఫ్రండ్స్ ఉండవచ్చు. వాళ్లల్లో గుడ్ క్వాలిటీస్ ఉంటే ఎంకరేజ్ చెయ్యి. నీవూ నేర్చుకో. వాళ్లల్లో ఉన్న బ్యాడ్ క్వాలిటీస్‌ని నీమాట వింటారనుకుంటే వదిలేయమని చెప్పు లేదా వారిని పట్టించుకోవద్దు. వాళ్లతో ఒక లిమిట్‌లో ఉండు" అన్నారు ఆయన తగుసూచనలిస్తూ.

"ఈ ప్రపంచంలో ప్రతిమనిషిలో మంచీ చెడూ ఉంటాయిరా. మంచిని పెంచుకోవాలి. పదిమందికీ పంచాలి. చెడును వదిలేయాలి" అటు అత్తయ్య, ఇటు వారు వాడికి ఒకరివెంట ఒకరు చెప్పవలసిన విషయాలు చెప్తూనే ఉన్నారు. నేను మౌనం వహించాను. పాప తన రూముకు వెళ్లి చదువు మొదలుపెట్టింది.

వాడిలో మార్పుకోసం అత్తయ్యగారు పాపచేత డ్రామా ఆడించారనే విషయం కూడా వాడికి చెప్పారు.

ఒక నాలుగురోజులు గడిచాయి. నేను వాడిపట్ల మౌనాన్నే ఆయుధంగా ధరించాను. వాడితో మాట్లాడటం మానివేశాను. వాడు తనను తాను మార్చుకుంటానని ప్రామిస్ చేయాలని ఎంతో ప్రయత్నించాడు. నేను వినలేదు. పట్టించుకోలేదు. ఓ రోజు రాత్రి 10 గంటలకు ఎప్పటిలాగే పడుకుందామని బెడ్‌మీదవాలాను. దిండు క్రింద తెల్లటి కాగితం మీద ముత్యాల్లాంటి అక్షరాలు.

"అమ్మా!

నామీద నీవు పెంచుకున్న నమ్మకాన్ని వమ్ముచేసాను. కొత్తగా ఈ ఏడాది మా కాలేజీలో చేరిన సందీప్, రాఘవ, సురేష్, సుధీర్‌లాంటి వాళ్ల స్నేహంతో థ్రిల్ అనిపించి, కొన్ని చెడ్డపనులు చేసాను. డాడీ క్యాంపులకు వెళ్లటం, నీ ఆరోగ్యం బాగుండకపోవటం నాకు ప్లస్ పాయింట్స్ అయ్యాయి. అందుకే చెడు స్నేహాలు చేయడానికి ఊతమయ్యాయి. చెడు నేర్చుకోవటం చాలా తేలిక. వదిలించుకోవటం కష్టం. అయినా అన్నీ కట్ చేసాను. కట్ చేసిన మన రాజుగాడి స్నేహాన్ని కొనసాగించాను. ఇక నుంచి మీ ఆశలకు, ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటాను".

- నీ చిన్నా

ఉత్తరాన్ని తీసుకొని వాడి రూముకు నడిచాను. వాళ్ల నాన్నమ్మ చెల్లి, వాడు కూర్చున్నారు. అత్తయ్య ఏదో చెప్తుంటే వింటున్నారు.

"చిన్నా!" అనగానే వాడు నావైపు సంతోషంగా చూసాడు. అత్తయ్య చెప్పటం ఆపి, ఏమిటన్నట్లు చూసింది. "ఎల్లుండి నీ పుట్టినరోజుకు మీక్లాస్ మొత్తాన్ని భోజనానికి పిలువు" అన్నాను. "థాంక్స్ మమ్మీ" అన్నాడు ఎంతో ఆనందంగా.

"మమ్మీ! నేను, బామ్మ మెనూ ప్రిపేర్ చేస్తాం" అంది పాప హుషారుగా.

అవును, నా పిల్లలు నిజంగా బంగారమే. నా పిల్లలేకాదు ఎవరి పిల్లలైనా బంగారమే. మనం తల్లిదండ్రులుగా వాళ్ల నడతను, అవసరాలను, అలవాట్లను గమనించి మంచి వైపు నడిపించాలి.

"ఆచార్యాత్ పాదమాదత్తే" అనే నాన్నచెప్పిన శ్లోకాన్ని మననం చేసుకుంటూ మంచం మీద వాలి ప్రశాంతంగా నిద్రకుపక్రమించాను. ●